# తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 61 పేజీలు - 6 శుక్రవారం 24 జనవరి 2025

## పేద బిడ్డలకు ఎందుకు లాప్‌ట్యాప్స్ పంపిణీ చేయడం లేదు : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**తొలిఅక్షరం/హైదరాబాద్,జనవరి23:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది గౌలిదొడ్డి(బాయ్స్) గురుకులంలో చదువుతూ ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందించేవారని ఇప్పుడు ఎందుకు అందించడం లేదని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కానీ ఈ ఏడాది మాత్రం ఇప్పటి వరకు విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందలేదన్నారు. గొప్ప చదువులు చదవాలనుకునే గురుకుల విద్యార్థులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గురుకులాల్లో లాప్‌ట్యాప్స్ అందలేదని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మెసేజ్ పెట్టడంతో ఈ మేసేజ్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మీరు హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు హెలికాప్టర్‌లో పోయిన ఖర్చుతో ఈ పేద బిడ్డలకు మంచి ల్యాప్‌టాప్స్ పంపిణీ చేయవచ్చు. రూ. 32 వేల ప్లేటు మీల్స్ గురించి నేను మాట్లాడను అని రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చురకలంటించారు.




## పాత రికార్డులన్నీ బ్రేక్

● ఒకే రోజు మూడు కంపెనీల ద్వారా రాష్ట్రానికి రూ. రూ.56,300 కోట్ల పెట్టుబడులు ● కంపెనీల ఏర్పాటుతో దాదాపు 10,800 ఉద్యోగావకాశాలు

**తొలిఅక్షరం/హైదరాబాద్,జనవరి23:** గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై తెలంగాణ మరో కొత్త రికార్డు నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఒకే రోజు భారీ పెట్టుబడులను సమీకరించింది. ముఖ్యంగా 3 కంపెనీల ద్వారా రాష్ట్రానికి రూ.56,300 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా రాష్ట్ర యువతకు దాదాపు 10,800 ఉద్యోగావకాశాలు లభించను న్నాయి. దేశంలో ఇంధన రంగంలో పేరొందిన సంస్థ 'సన్ పెట్రో కెమికల్స్' రాష్ట్రంలో రూ.45,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ, జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై (ఎంవోయూ) సంతకం చేసింది. నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుల మొత్తం ఇంధన సామర్థ్యం 3,400 మెగావాట్లు. వీటికి 5,440 మెగావాట్ల సామర్థ్యముండే సోలార్ విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7000 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే. సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ ఒప్పందంపై కీలక చర్చలు జరిపారు. పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక

వివరాలు 2లో



## తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్రం ఫోకస్

● చేగుంట నుంచి దుబ్బాక మీదుగా రాజన్నసిరిసిల్లకు నేషనల్ హైవేకు ఎంపీ రఘురందన్‌రావు హామీ

**తొలిఅక్షరం/హైదరాబాద్,జనవరి23:** తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే అనేక మార్గాల్లో కొత్త రహదారులు మంజూరు చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న పలు జాతీయ రహదారులను కూడా విస్తరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ రహదారిని 4 నుంచి 6 వరుసలుగా విస్తరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. మరికొన్ని ప్రాంతాల మధ్య కొత్తగా

వివరాలు 2లో

## బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టులో ఊరట

● రైతు మహా ధర్నాకు అనుమతి




## హైదరాబాద్ ఆధారిత కంపెనీలతో దావోస్‌లో ఒప్పందాలా.?

● ఇదేనా రేవంత్ ఇన్నోవేటివ్ ఆలోచన ● ట్విటర్ వేదికగా సీఎంపై కేటీఆర్ సెటైర్లు



**తొలిఅక్షరం/హైదరాబాద్,జనవరి23:** రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో పలు కంపెనీలతో చర్చలు, ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే మేఘా, స్కైరూట్ ఏరోస్పేస్, కంట్రోల్‌ఎస్ వంటి పలు కంపెనీలతో వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. అయితే ఈ పెట్టుబడుల ఒప్పందాలపై బీఆర్ఎస్ వర్కింగ్

వివరాలు 2లో




## పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**తొలిఅక్షరం/హైదరాబాద్,జనవరి23:** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గి చలితీవ్రత నానాటికి పెరుగుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు చలికారణంగా గజగజ వణికిపోతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు జిల్లాలో దట్టమైన

వివరాలు 2లో

## విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం

త్వరలో గ్రేటర్‌లో కలవనున్న 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు



**తొలిఅక్షరం/హైదరాబాద్,జనవరి23:** హైదరాబాద్ మహా నగరం విశ్వ నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచంలోని టాప్ సిటీల్లో హైదరాబాద్ కూడా ఒకటిగా నిలుస్తోంది. లండన్, న్యూయార్క్ వంటి ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ట్రైసిటీలు ఉండగా.. నగర విస్తరణలో భాగంగా ఫ్యూచర్ సిటీ పేరుతో ఫోర్త్ సిటీని కూడా నిర్మిస్తున్నారు. దాదాపు 20 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుంది. ఇక నగర విస్తరణలో భాగంగా సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని పెంచాలని భావిస్తోంది. ఔటర్ రింగు రోడ్డు వరకూ జీహెచ్‌ఎంసీని విస్తరణపై దృష్టిపె ట్టింది. 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లనను గ్రేటర్‌లో కలపాలని భావిస్తోంది. ఈ క్రమంలో సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే మున్సిపల్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమచారం.

వివరాలు 2లో



## అర్హులైన వారందరికీ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

● మరోమారు స్పష్టం చేసిన మంత్రి పొన్నం

**తొలి అక్షరం/కరీంనగర్,జనవరి 23:** రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మంత్రులుగా తమ జోక్యం ఉండదని, న్యాయంగా అర్హులైన వారందరికీ మంజూరు చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అధికారులు ప్రజాపాలన సభల్లో ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తిస్తారని మంత్రి తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 15వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరిగేలా సాఫ్‌వేర్ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.2 లక్షలకు పైగా ఇంకా రుణమాఫీ కాని రైతులకు మార్చి నెలలో షెడ్యూల్ పెట్టి రుణమాఫీ చేస్తామని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, ముందు సమస్యలను అధికారులు, తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజా సమస్యలు పరిష్కరించడం తన బాధ్యతంటూ మంత్రి పొన్నం చెప్పారు.




## మంత్రి సీతక్క వ్యాఖ్యలతో పల్లెల్లో ఎన్నికల ఫీవర్

● ఏ నలుగురు ఉన్న చోట్ల ఎన్నికలపై చర్చ ● స్థానిక సంస్థల ఎన్నికలపై ఊహాగానాలు ● త్వరలో రాష్ట్రంలోని 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లోని సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు

**తొలిఅక్షరం/హైదరాబాద్,జనవరి23:** తెలంగాణలోని పల్లెల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల ఫీవర్ మొదలైంది. గ్రామాల్లో ఏ నలుగురు ఓ చోట గూమి కూడినా స్థానిక సంస్థల ఎన్నికల గురించే మాట్లాడుకుంటున్నారు. ఈసారి ఎవరు పోటీ చేస్తారు..? పోటీ చేసే ఫలానా మల్లయ్య లేదా ఎల్లయ్య గెలుస్తాడా..? ఓట్లు పడతాయా..? అని సీరియస్ డిస్కషన్ పెట్టుంటున్నారు. ఇక నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడు వస్తుందా..? అని ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు సైతం ఎదురు చూస్తున్నారు. సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్న వారు గ్రామాల్లోనే మకాం వేసి ప్రజల్ని మచ్చిక చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంచి, చెడులతో ఏమాత్రం సంబంధం లేకుండా గ్రామాల్లో ప్రతి కార్యక్రమంలో పాల్గొని

వివరాలు 2లో

## కిడ్నీ రాకెట్‌లో 8 మంది దళారులు

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 23:** సరూర్‌నగర్ పరిధిలోని అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఎనిమిది మంది దళారులను పోలీసులు గుర్తించారు. గత ఆరు నెలలుగా అలకనంద ఆస్పత్రిలో ఈ తతంగం నడుస్తున్నట్లు గుర్తించారు. బెంగళూరుకు చెందిన వైద్యుడు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వైద్యుడితోపాటు మరికొంత మంది ప్రమేయం ఉందేమోనన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఆస్పత్రి నిర్వాహకుడు సుమంత్‌తోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

## హైదరాబాద్ ఆధారిత కంపెనీలతో దావోస్‌లో ఒప్పందాలా.?

(మొదటి పేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. హైదరాబాద్ ఆధారిత కంపెనీలను దావోస్ తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకోవటమేంటని అన్నారు. రేవంత్ సర్కార్ ఇన్నోవేటివ్ ఆలోచన, పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. 'వినూత్న ఆలోచన అంటే ఏమిటి ? హైదరాబాద్ ఆధారిత కంపెనీలను స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కి వేల మైళ్ల దూరం ప్రయాణించి పెట్టుబడులు ప్రకటించేలా చేయడం! నిజంగా సర్కస్‌లా ఉంది. హైదరాబాద్‌లో చాయ్ తాగుతూ పూర్తి చేయాల్సిన ఒప్పందాలను.. స్విట్జర్లాండ్‌లో హాట్ చాక్లెట్‌తో పూర్తి చేయాల్సి వచ్చింది.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## పడిపోతున్న ఉష్ణోగ్రతలు

(మొదటి పేజీ తరువాయి)

పొగమంచు కమ్మేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కారణంగా యాదాద్రి, భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని కాల్వపల్లి వాగులో కారు ప్రమాదానికి గురైంది. పొగమంచు రోడ్డును కప్పేయడంతో వాగులోకి కారు దూసుకెళ్లింది. కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి మండలంలో ఉదయం 9 గంటల వరకు పొగమంచు దగ్గలేదు. వరంగల్ రహదారిపై రోడ్లు పొగమంచుతో వాహనాలు కనిపించక ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనదారులు వాహనాలకు లైట్లు వేసుకుని వేగాన్ని తగ్గించుకుని ప్రయాణం చేశారు. హైదరాబాద్ నగరంలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్‌చెరులో 9.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. రాజేంద్రనగర్ 10.5, ఖమ్మంలో 18, రామగుండంలో 12.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరిగిన చలి, కాలుష్యం వల్ల చిన్నారులు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

## విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం

(మొదటి పేజీ తరువాయి)

జీహెచ్‌ఎంసీ కాకుండా ఓఆర్ఆర్ లోపల 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరంతో పోలిస్తే అభివృద్ధిలో ఇవి వెనుకబడ్డాయి. నగరం వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఓఆర్ఆర్ వరకూ అభివృద్ధి చేసేందుకు వాటిని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది.

## పదేళ్లు పడుకుని ఇప్పుడు విమర్శలా

**- రేషన్ కార్డులు ఇస్తామంటే అడ్డుకోవడమా**

**- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల**

**తొలి అక్షరం/యాదగిరిగుట్టజనవరి 23:** తెలంగాణ రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని చూస్తుంటే బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. గతంలో ఒక్క కార్డు కూడా ఇవ్వలేని వారు ఇవ్వాళ ప్రజల పేరుతో మొసలి కన్నీరు కారుస్తున్నారని, పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని సిగ్గులేని నేతలు గ్రామసభలకు అడ్డుతగులుతున్నారని మంత్రి ఘాటుగా స్పందించారు. దీక్షలు, నిరసనల పేరుతో అడుగడుగునా అడ్డం పడుతున్నారని తుమ్మల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంస పాలనకు గురైన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. అందుకే తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు రుణమాఫీ చేసినట్లు చెప్పుకొచ్చారు. అన్నదాతలకు మేలు చేస్తుంటే నల్లగొండలో రైతు దీక్ష చేస్తున్నారంటూ మంత్రి తుమ్మల నిప్పులు చెరిగారు. నల్లగొండ రైతు దీక్ష చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదని మంత్రి నిలదీశారు. జనవరి 26 నుంచి అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మల మరోసారి గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును తాకట్టుపెట్టి కొంతమంది రైతులకు రైతు బంధు వేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో దొడ్డు బియ్యం మాఫియా ఉందని, అందుకే ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకువస్తారని మంత్రి తుమ్మల ధీమా వ్యక్తం చేశారు.



## పాత రికార్డులన్నీ బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి అజిత్రెడ్డి, ఇన్వెస్టిమెంట్స్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఎం సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించే తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చిన సన్ పెట్రో కెమికల్స్ ప్రతినిధులను అభినందించారు. ఈ ఒక్క ఒప్పందంతో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గత ఏడాది దావోస్లో సాధించిన రూ.40 వేల కోట్ల పెట్టుబడుల రికార్డును సమం చేసిందని అన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాల దృష్ట్యా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. హరిత ఇంధన ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. సన్ పెట్రో కెమికల్స్ భాగస్వామ్యంతో భవిష్యత్తులో డిమాండ్‌కు అనుగుణంగా ఇంధన వనరులు సమకూరుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలతో పాటు నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మరోవైపు, తెలంగాణలో మరో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ అందుబాటులోకి రానుంది. రూ.10 వేల కోట్లతో దీనిని నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ కంపెనీ 400 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,600 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. అటు, రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ స్థాపించనున్నట్లు జేఎస్?డబ్ల్యూ సంస్థ ప్రకటించింది. అమెరికాకు చెందిన డిఫెన్స్ టెక్నాలజీ సంస్థ అనుబంధంతో ఈ యూనిట్ నెలకొల్పనుంది. దాదాపు రూ.800 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీనికి సంబంధించి దావోస్? వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో జేఎస్‌డబ్ల్యు డిఫెన్స్ అనుబంధ సంస్థ అయిన జేఎస్‌డబ్ల్యు యూఏవీ లిమిటెడ్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో దాదాపు 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. ఐటీ, ఫార్మాతో పాటు అన్ని రంగాల పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయని, ఈ ఒప్పందంతో రక్షణ రంగంలో కీలక ఆవిష్కరణలతో పాటు డ్రోన్ టెక్నాలజీకి తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం రక్షణ రంగంలో సరికొత్త ట్రెండ్ సృష్టిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

## తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్రం ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

రహదారులు నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రహదారులు నిర్మిస్తుండగా.. మరికొన్ని రోడ్లను కేంద్రం నిర్మిస్తోంది. తాజాగా తెలంగాణలో మరో నేషనల్ హైవే నిర్మాణంపై కీలక హామీ వచ్చింది. చేగుంట నుంచి దుబ్బాక మీదుగా రాజన్నసిరిసిల్ల వరకు నేషనల్ హైవే నిర్మించాలని ఎప్పట్నుంచో డిమాండ్ ఉంది. ఈ విషయంపై స్థానికులు పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు కూడా సమర్పించారు. తాజాగా.. ఆ నేషనల్ హైవేపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక హామీ ఇచ్చారు. జాతీయ రహదారి నిర్మాణం విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. స్థానిక ప్రజల ఆంకాంక్షల మేరకు రోడ్డు మంజూరయ్యేలా కృషి చేస్తానని అన్నారు. దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పలువురు ఈ విషయంపై ఎంపీకి వినతిపత్రం అందించారు. చేగుంట -%సిరిసిల్ల మధ్య నేషనల్ హైవే చేపడితే రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన వేములవాడకు ఈజీగా చేరుకోవచ్చునని అన్నారు. వేములవాడ- హైదరాబాద్ మధ్య కూడా దూరం తగ్గుతుందని చెప్పారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ రఘునందన్ రావు ఈ రహదారి అంశాన్ని తప్పకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నేషనల్ హైవే మంజూరుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. త్వరలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి రహదారి నిర్మాణంపై చర్చిస్తానని ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు. కాగా, ఎంపీ ప్రకటనతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్లుగా ఈ రహదారి నిర్మాణం కోసం పోరాడుతున్నామని చెప్పారు. త్వరితగతిన రహదారి మంజూరైతే.. ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని అంటున్నారు.

## బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టులో ఊరట

**● రైతు మహా ధర్నాకు అనుమతి**

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 23:**తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల వేళ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీ భారీ రైతు మహా ధర్నా నిర్వహించేందుకు సిద్ధం కాగా.. పోలీసులు షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనెల 21వ తేదీన నల్గొండ జిల్లా కేంద్రంలో ఈ రైతు మహా ధర్నాను నిర్వహించాలని.. ముందుగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధం కాగా.. అందుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ వర్గాలు తెలంగాణ హైకోర్టుకు ఎక్కారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈనెల 28వ తేదీన రైతు మహా ధర్నా నిర్వహించుకునేందుకు బీఆర్ఎస్‌కు అనుమతులు ఇచ్చింది. దీంతో బీఆర్ఎస్ పార్టీ వర్గాలు సంతోషంలో ఉన్నాయి. ఈనెల 28వ తేదీన నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో రైతు ధర్నా నిర్వహించుకునేందుకు బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు మహా ధర్నా నిర్వహించుకోవచ్చని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే ఈ రైతు మహా ధర్నాకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఇతర నాయకులు హాజరు కానున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్రంలోని రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మొదట.. ఈనెల 21వ తేదీన ఈ రైతు మహాధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినా.. అందుకు పోలీసులు అనుమతించలేదు. అయితే జిల్లాల్లో ప్రస్తుతం గ్రామ సభలు, సంక్రాంతి రద్దీ కారణంగా బందోబస్తు ఇవ్వలేమంటూ నల్గొండ జిల్లా పోలీసులు ఈ రైతు మహా ధర్నాకు అనుమతి నిరాకరించారు. దీంతో తీవ్ర ఆగ్రహం




వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు.. ఈ రైతు మహా ధర్నా అనుమతి కోసం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు అనుమతిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

## మంత్రి సీతక్క వ్యాఖ్యలతో పల్లెల్లో ఎన్నికల ఫీవర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలతో మమేకమవుతున్నారు. మరికొందరు ఒకడుగు ముందుకేసి ప్రత్యేకంగా మేనిఫెస్టో సైతం రిలీజ్ చేస్తున్నారు. తమను గెలిపిస్తే.. గ్రామాన్ని అభివృద్ధి పథకంలో తీసుకెళ్తామంటూ హామీలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కీలక అప్డేట్ ఇచ్చారు. గ్రామ పంచాయతీలకు వీలైనంత త్వరలో ఎన్నికలను నిర్వహించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయగా.. ఇప్పటికే నివేదిక సిద్ధమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగించుకొని వచ్చాక ఆమోదం పొందుతుందని తెలిపారు. బుధవారం సెక్రటేరియట్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన మంత్రి.. సీఎం రేవంత్ వచ్చాక పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంటుందని అన్నారు. కాగా, మంత్రి ప్రకటనతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఫిబ్రవరి చివరి వారంలో ఎన్నికలు ఉండే ఛాన్స్ ఉందని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. దీంతో గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీలుగా పోటీ చేసే వారు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో మొత్తం 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. 1,14,620 వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలను నిర్వహించనుంది. అందుకు సంబంధించిన జాబితాను పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించింది. క్రితంసారి 535 మండలాల్లోని 12,732 గ్రామాల్లో మొత్తం 1,13,152 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈసారి అదనంగా మరో 5 మండలాలు, 234 గ్రామాలు, 1,468 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నట్లు తెలిసింది. గతేడాది ఫిబ్రవరితో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగా.. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పాలనను సాగిస్తున్నారు.

## ఏకపక్షంగా కూల్చివేతలు మంచివికావు : దానం నాగేందర్

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 23:**హైదరాబాద్ నగరంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న షెడ్లను కూల్చివేతలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి స్పందించారు. కూల్చివేతలపై అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడిన దానం.. పేద ప్రజల జీవనాధారాన్ని అధికారులు ధ్వంసం చేస్తున్నారని ఫైరయ్యారు. నిజంగా రోడ్లకు ఇబ్బంది ఉన్న చోట్ల కూల్చివేతలు చేపడితే ఎటువంటి నష్టం లేదని అన్నారు. కానీ అధికారులు అడ్డగోలుగా కూల్చివేతలు చేపడుతున్నారన్నారు. ఈ కూల్చివేతల విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. చిరు వ్యాపారులు పొట్టకూటి కోసం షెడ్లు ఏర్పాటు చేసకుంటే వాటిని కూల్చేయటం దుర్మార్గం అన్నారు. వాటిని కూల్చేస్తే వారికి బతుకుదెరువు ఏంటని ప్రశ్నించారు. రేవంత్ సీఎం అయిన తొలినాళ్లలో ఐటీసీ కోహినూర్ వద్ద కుమారి ఆంటీకి కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైందని చెప్పారు. సీఎం రేవంత్ జోక్యం చేసుకొని ఆమె జోలికి వెళ్లొద్దని చెప్పినట్లు గుర్తు చేశారు. కుమారి ఆంటీ లాగే ఇతర వ్యాపారుల జోలికి వెళ్లొద్దని దానం కోరారు. ఒకవేళ పాలసీ కింద కూల్చివేతలు చేపడితే.. ముందు పాతబస్తీలో కూల్చివేతలు చేపట్టాలన్నారు. అలా చేస్తే.. తాను కూడా సహకరిస్తానని అన్నారు. కూల్చివేతలు చేపడితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. కూల్చివేతల కారణంగా తమకు నిద్రకూడా పట్టడం లేదని దానం వ్యాఖ్యనించారు.

## కొత్తరేషన్‌కార్డులతో 40 లక్షల మందికి లబ్ధి : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 23:**ప్రస్తుతం తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఇప్పటికే అప్లై చేసుకున్న వారికి సంబంధించి రేషన్ కార్డు అర్హత కలిగిన వారి జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే దరఖాస్తు చేసుకున్న జాబితాలో పేరు లేని వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే గ్రామ సభలు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. రేషన్ కార్డు జాబితాలో పేరు లేని వారు ఈ గ్రామసభల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, ప్రభుత్వం సూచిస్తోంది. దీంతో గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. అయితే రేషన్ కార్డుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామ సభల్లో తీవ్ర గందరగోళం, ఆందోళనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. 10 ఏళ్ల పాటు రేషన్ కార్డుల జారీపై దృష్టి పెట్టలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో 40 లక్షల మందికి లబ్ధి చేకూర్చేలా కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తోందని చెప్పారు. కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్, మానకొండూరులో నిర్వహించిన గ్రామసభలకు హాజరైన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ దుకాణాల్లో ఇక నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తేల్చి చెప్పారు. అయితే రేషన్ కార్డు రాని వారు అధైర్యపడొద్దని.. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు రాలేదని ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలందరికీ రేషన్ కార్డులు ఇస్తామని.. ప్రతిపక్షాలు ఆరోపణలను ఎవరూ పట్టించుకోవద్దని చెప్పారు.ప్రజాపాలన సందర్భంగా వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈనెల 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన గ్రామసభలు.. ఈనెల 24వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అయితే ఇప్పటికే రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా.. అందులో పేరు లేకపోతే ఈ గ్రామ సభల్లో మళ్లీ అప్లై చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో.. ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు.

## వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదు : హరీశ్‌రావు

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 23:**వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. పెన్షన్లలో కోతలు విధించడమంటే.. వారి నోటికాడి బుక్కను లాగేసుకోవడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీలో కొడుకు ఇంటి పన్ను కట్టలేదని తల్లి వృద్ధాప్య పెన్షన్‌లో కోత విధించిన ఘటనపై హరీశ్‌రావు స్పందించారు. కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్ ఆపడం అన్యాయం, అమానుషం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వృద్ధుల బతుకు బండి నడిచేది ఎట్ల? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.అధికారంలోకి వస్తే ప్రతి నెలా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ. 2 వేల పింఛన్‌ను గుంజుకోవడం దుర్మార్గమైన చర్య అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకవైపు లబ్ధిదారుల్లో కోత విధిస్తూ, మరో వైపు చేతికందిన పింఛన్‌ను ఇంటి పన్ను బకాయిలో జమ చేయడం శోచనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీ పరిధిలో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటిపన్ను, ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు చేరుతాయి

**- 26వ డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి**



**తొలి అక్షరం/మేడ్చల్ మల్కాజిగిరి, మేడిపల్లి, జనవరి 23:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 26వ డివిజన్ ప్రజా పాలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మేయర్ అమర్ సింగ్ తో కలిసి పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు చేరుతాయని అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులకు, అర్హత కలిగిన వారికి తప్పకుండా చేరుతాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు , అధికారులు మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవ ఏర్పాటు




**తొలి అక్షరం/చెన్నూరు:** ఉర్సు ఉత్సవ ఏర్పాట్లు పూర్తి..స్థానిక చెన్నూర్ లోని జామా మస్జీద్ వెనుకాల గల హజరత్ సయ్యద్ షా బాబా గంధం ఈ నెల 25వ జనవరి తేదీ రోజు ప్రారంభమై 26 వ జనవరి వరకు ఉంటాయి అని ఉర్సు ఉత్సవ అధ్యక్షుడు నవాజోద్దీన్ తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి దర్గా భక్తులు కుల మతాల కు అతీతంగా పాల్గుని విజయవంతం చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉర్సు ఉత్సవ ఉప అధ్యక్షుడు ఖాజా ఖంరోద్దీన్ మరియు కమీటీ సభ్యులు పాల్గున్నారు.

# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి




**తొలి అక్షరం/నస్పూర్:** నస్పూర్ మున్సిపాలిటీ పరిధి శ్రీరాంపూర్ 17 వ వార్డు హిమ్మత్ నగర్ లో ప్రజాపాలనలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరిం చారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ మేకల దాసు మాట్లాడుతూ అర్హులైన నా వార్డు ప్రజలకు, ప్రభుత్వం అందించే పథకాలను తప్పకుండా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణు, శ్రీరాంపూర్ ఎస్సై మేకల సంతోష్, కమిషనర్ సిహెచ్ సతీష్, పాల్గొన్నారు.

# జంగా రాఘవ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన సద్దాం హుస్సేన్..

**తొలి అక్షరం/ధర్మసాగర్:** ఇటీవల జరిగిన ఖో ఖో పోటీల్లో భారత్ కు మొట్టమొదటి వరల్డ్ కప్ విజయాన్ని అందించిన క్రీడాకా రులకు శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ ఖో ఖో రాష్ట్ర అధ్యక్షుడిగా ముందుండి పోటీలో పాల్గొన్న తెలంగాణ క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ మరియు ఖో ఖో రాష్ట్ర అధ్యక్షులు జంగా రాఘవ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సద్దాం హుస్సేన్ గురువారం టేకులగూడెంలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియచేసి శాలువాతో సత్కరించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు,జంగా అభిమానులు పాల్గొన్నారు.



# పేదరిక నిర్మూలనలో వనరుల వృద్ధే కీలకం

- **రాజకీయ ప్రయోజనాల కోసమే ఉచితాలు**
- **సంక్షేమం సమగ్రాభివృద్ధే పాలకుల లక్ష్యం కావాలి**
- **పింగళి వెంకటేశ్వర రావు (సామాజిక వేత్త)**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జనవరి23:** తెలంగాణ లో మొత్తం జనాభా 3 కోట్ల 83 లక్షలు రాష్ట్రంలో మొత్తం కుటుంబాల సంఖ్య కోటీ 17 లక్షల 44 వేల 954 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత అమలులో ఉన్న రేషన్ కార్డుల సంఖ్య 89 లక్షల 21 వేల 907.అందులో లబ్ధిపొందుతున్న వారి సంఖ్య 2 కోట్ల 70 లక్షల మంది. బిఆర్ఎస్ ప్రభుత్వం వివిధ కారణాలతో 2014 తర్వత 2 లక్షల 46 వేల 324 రేషన్ కార్డులను రద్దు చేసింది.ఇక పోతే నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం గత పదేళ్ల కాలంలో తెలంగాణలో పేదరికం తగ్గింది.2015-16 లో రాష్ట్రంలో పేదరికం నిష్పత్తి 13.18 శాతం.2019-21 నాటికి పేదరికం 5.88 శాతానికి తగ్గింది.అదే 2022%-% 23 ఆర్థిక సంవత్సరాంతానికి తెలంగాణలో పేదరికం కేవలం 3.76 శాతంగానే నమోదయింది.2015 -2016 ,2019-2021 గణాంకాలను పరిగణలోకి తీసుకొని 2022-2023 లో పేదరికం 3.76 శాతంగా ఉంటుందని అంచనా వేసినట్లు నీతి ఆయోగ్ పేర్కొంది.రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల జారీకి తెరలేపింది.ప్రాథమిక అంచనా ప్రకారం కొత్తగా 6 లక్షల 68 వేల 309 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయవలసి ఉంటుందని పౌరసరఫరాల సంస్థ అంచనా వేసింది.ఈ మేరకు కార్డులు జారీ చేసిన పక్షంలో 11 లక్షల 65 వేల 052 మంది లబ్ధిపొందుతారని భావస్తుంది.ఇప్పటికే లబ్ధి పొందుతున్న వారితో కలిపితే తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారుల సంఖ్య 2 కోట్ల 85 లక్షల వరకు ఉంటుంది. అంటే మొత్తం రాష్ట్ర జనాభా 3 కోట్ల 83 లక్షల మందిలో 2 కోట్ల 85 వేల తెల్ల రేషన్ కార్డుతో ప్రయోజనం పొందడానికి అర్హులుగా గుర్తించడం జరుగుతుంది.తెలంగాణలో పేదరికానికి, పేదల కోసం ఇచ్చే తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల సంఖ్యకు పొంతన ఉండటం లేదు.ఉచితాలు, ప్రభుత్వం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాల పొందాలనుకుంటున్న వారు రాష్ట్ర జనాభాలో 80 శాతానికి పైగా ఉన్నందుననే రేషన్ కార్డులకు డిమాండ్ ఏర్పడుతుంది.రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఐదు వందల రూపాయలకే వంటగ్యాస్ సిలిండర్, పది లక్షల వరకు ఆరోగ్య శ్రీ వర్తింపు, ఇందిరమ్మ ఇల్లు తదితర సంక్షేమ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్తగా రేషన్ కార్డుల జారీకి డిమాండ్ పెరుగుతోంది.ఇక మీదట రేషన్ కార్డులపై సన్న బియ్యం సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పేద,మధ్య తరగతి కుటుంబాలు రేషన్ కార్డు కోసం ఆశపడుతున్నారు. బహిరంగ మార్కెట్ లో సన్న రకం బియ్యం కిలో 50 నుండి 56 రూపాయల వరకు ఉండటంతో పట్టణ వాసులు, మధ్య తరగతి వర్గాలు రేషన్ షాపుల్లో సన్న బియ్యం తీసుకోవాలని ఆలోచిస్తున్నారు.పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాలకు తెల్ల రేషన్ కార్డుదారులను అర్హులుగా గుర్తించడంతో కూడా రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగింది.బిఆర్ఎస్ ప్రభుత్వం వివిధ కారణాలతో 2 లక్షల 46 వేల 324 రేషన్ కార్డులను రద్దు చేసింది. అందులో 2 లక్షలకు పైగా రేషన్ కార్డుదారులు తమకు అన్యాయం జరిగిందని భావిస్తున్నారు.బ్రతుకు దెరువు కోసం కారు కొన్న వారికి, ద్విచక్రంవాహనం కలిగి ఉన్న వారికి ఉన్న రేషన్ కార్డులను ప్రభుత్వం తొలగించింది.**హైదరాబాద్ లో టాక్సీలు నడుపుతున్న అనేక మంది** ఈ విధంగా రేషన్ కార్డులను కోల్పోయారు. అల్పాదాయ వర్గాల్లో అత్యధికులు రేషన్ కార్డుల రద్దు నిర్ణయానికి గురి కావలసి వచ్చింది.వారంతా ఇప్పుడు రేషన్ కార్డులు కావాలని అడుగుతున్నారు.రద్దయిన కార్డులను రెన్యూవల్ చేయాలనే వారి సంఖ్య కూడా లక్షకు పైగానే ఉందని పౌరసరఫరాల సంస్థ పేర్కొనడం గమనార్హం.రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగింది. **ఉపాధి అవకాశాలుల సన్నగిల్లుతున్నాయి.** పేదల ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవుతుంది. వ్యయం పెరుగుతోంది.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పన్నుల విధానం సామాన్య , మధ్యతరగతి వర్గాలను ఆర్థికంగా కృంగదీస్తుంది.ఏది కొనాలన్నా, ఎంత తక్కువ ధర వస్తువు కొనాలన్నా, చివరికి ఆసుపత్రి వైద్యం, నిత్యావసర మందులపై కూడా ప్రభుత్వాలు భారీ మొత్తంలో పన్నులు వసూలు చేస్తున్నాయి. ఉచితాల పేరుతో పేదలకు ఇచ్చేదానికంటే కూడా రక రకాల పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేస్తున్న పన్నులే అధికమని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.పాలకులు సంక్షేమ రాజ్యం స్ఫూర్తిని విస్మరించి వ్యాపార రాజ్యం విధానాలను ఆచరించడంతో అడుగడుగున పేదలపై భారాలను మోపుతున్నారు.సంపన్నులకు ప్రయోజనాలు కల్పిస్తునే పేదలపై భారాలు మోపడంతో దారిద్ర్యరేఖ దిగువన ఉన్న పేద కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి.ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం చేస్తున్న ప్రయత్నాలు సానుకూల ఫలితాలు ఇవ్వక పోవడానికి బహుళ పన్నుల విధానాలే కారణం అని భావన కలుగుతుంది.రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి.పేదరికం, అల్పాదాయ, మధ్యతరగతి వర్గాలకు కార్డులు అందాలి. వారందరికీ సన్న బియ్యం అందాలి.రేషన్ కార్డు ద్వారా పేదల కోసం అమలు జరుపుతున్న అంక్షేమ, అభివృద్ధి పథకాలను వారి చెంతకు చేర్చాలి.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలన్ని రేషన్ కార్డుతో ముడిబడి ఉన్నాయి.అత్యధికుకు రేషన్ కార్డు లేక పోవడంతో ప్రభుత్వ ప్రయోజనాలు పొందడం లేదు.**అల్పాదాయ వర్గాలు:** పేదరికం,మధ్యతరగతి వర్గాల మధ్య నలిగిపోతున్నాయి.స్థిరాస్థులు ఉన్న నగర, పట్టణ వాసులు నెలవారి ఆదాయం లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులను కూడా ప్రభుత్వాలు పరగణలోకి తీసుకోవాలి. ముఖ్యంగా అల్పాదాయ వర్గాల ప్రయోజనాలు పరిరక్షించే విధంగా రేషన్ కార్డుల జారీ పారదర్శకంగా జరగాలి.**రాజకీయ పార్టీలకు పేదల ఓట్లే ప్రామాణికం:** లక్షలు, కోట్ల రూపాయల ప్రయోజనం పొందుతున్న ఉన్నత వర్గాల ఓట్లతో రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడం లేదన్నది జగమెరిగిన సత్యం.పేదల ఓట్లే గెలుపోటములను నిర్ణయిస్తున్నాయి. అలాంటి పేదలకు పాలకులు ఏదో చేస్తున్నామనే ప్రచారం చేయకుండా నిజంగా పేదరికాన్ని ఏ మేరకు నిర్మూలించగలిగామనే ప్రశ్న వేసుకుంటే



రేషన్ కార్డులకు,ఉచితాలకు ప్రజలు ఆశపడే పరిస్థితి ఉండదు.వనరుల వృద్ధి, ఉత్పాదకత, ఉపాధి అవకాశాల పెంపు లాంటి చర్యలు మాత్రమే పేదరికాన్ని నిర్మూలించగలవు. వనరులను వృద్ధి చేసి ప్రతి మనిషికి పని కల్పించిన పక్షంలో ఉచితాల పేరుతో ఖజానాను ఖాళీ చేసే పరిస్థితి ఉత్పన్నం కాబోదు.ప్రజలు సంక్షేమ రాజ్యాన్ని, సమగ్ర ప్రగతిని కోరుకుంటారు.అలాంటి ప్రజల కలలను బాధ్యతగా తీసుకొని నెరవేర్చే విధంగా పాలకులు వ్యవహరించాలని ఆశిద్దాం.

**- పింగళి వెంకటేశ్వర రావు (సామాజిక వేత్త)**

# భూగర్భ జలాల నాణ్యతపై అవగాహన






- **జిల్లా భూగర్భ జలశాఖ అధికారి వేముల సురేష్**






**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జనవరి23:**బయ్యారం మండలంలోని కొత్తపేట గ్రామంలో భూగర్భ జలాల నాణ్యతపై జిల్లా భూగర్భ జలశాఖ అధికారి వేముల సురేష్ అధ్యక్షతన నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ (ఎన్హెచ్పి) లో భాగంగా షేర్ సేవా సంస్థ అధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా భూగర్భ జలశాఖ అధికారి వేముల సురేష్ నీటినాణ్యతపై వివరించారు.సంచార నీటి నాణ్యత ప్రయోగశాలవాహనం రాష్ట్రంలో పిజోమీటర్స్ లేని గ్రామాలను ఎంపిక చేసి అక్కడ నీటి నాణ్యతను పరీక్షించనున్నట్లు తెలిపారు.వ్యవసాయ పొలాల్లోనే నీటి నమూనాలు సేకరించి అక్కడే పరీక్షలు నిర్వహించారు. ఈసంచార ప్రయోగశాల వాహనంద్వారా జిల్లాలో 25-30 నీటి నమూనాలు సేకరించినట్లు వివరించారు.భూగర్భ జలాలలో నిలవణాలు,ఫ్లోరైడ్,నైట్రేట్, ఫిహెచ్, సల్ఫేర్ఎంత మోతాదులో ఉన్నాయి అనే విషయాలని అక్కడికక్కడే సేకరించి వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉన్నాయా లేవా అనే విషయాన్నీ అక్కడే రైతులకు వివరించారు.లోపాలు ఉన్ననీటికి సలహాలు అందించారు.అధిక ఎరువుల వాడకం వల్ల నష్టాలు,పంటమార్పిడి లాభాలు, వర్షపు నీటిసంరక్షణ పద్ధతులు,ఇంకుడు గుంతల వల్ల లాభాలు, వర్షపునీటికి ఒడిసిపట్టడం,భూగర్భ జలాల వినియోగంపై వివరి ంచారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస రావు,అసిస్టెంట్ జియో ఫిసిస్ట్ శ్రీనివాస్,అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్ స్నేహ,పంచాయతీ కార్యదర్శి,ఇర్ప రాజేష్ మరియు షేర్ సేవా సంస్థ ప్రతినిధి వసుంధర తదితరులు పాల్గొన్నారు.

# వరించిన పురస్కారం... ఆనందంలో గ్రాండ్ మాస్టర్

- సాయినాథ్ యాదవ్ కు ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కార్-2025 అవార్డు
- షాద్ నగర్ పట్టణ యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ గ్రాండ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గ్రాండ్ మాస్టర్ సాయినాథ్ యాదవ్
- అవార్డు దక్కినందుకు సంతోషం వ్యక్తం చేసిన గ్రాండ్ మాస్టర్ సాయినాథ్ యాదవ్





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి23:** మనిషి జన్మ ఇచ్చినందుకు ఎంతో కొంత సార్ధకత ఉండాలని, ఏదైనా సాధించి తాను కొందరికి మార్గదర్శకంగా ఉండాలని, తన తండ్రి నమ్ముకున్న మార్గాన్ని ఎంచుకొని ఆయన కీర్తి శేషులు అయిన ఆయన సిద్ధాంతాన్ని తన సిద్ధాంతంగా నమ్ముకుని ఎంతోమంది నిరుపేద బాలబాలికలకు ఉచితంగా కరాటే శిక్షణనిస్తూ ఎంతో మంది విద్యార్థిని విద్యార్థులను కరాటే శిక్షణలో అద్వితీయంగా తీర్చి దిద్దుతూ, ఎంతోమందిని కరాటే మాస్టర్లుగా తీర్చిదిద్దుతూ, ఎన్నో కరాటే టోర్నమెంట్లు నిర్వహించి మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులను వెలుగులోకి తెస్తున్న మన షాద్ నగర్ పట్టణ యువతేజం, యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గ్రాండ్ మాస్టర్ సాయినాథ్ యాదవ్. ఇంతటి మహోన్నతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రాండ్ మాస్టర్ సాయినాథ్ యాదవ్ ను హైదరాబాదులోని భాస్కర్ ఆడిటోరియం వేదిక గా, మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ పురస్కారం 2025 వరించింది. హైదరాబాదు మార్షల్ ఆర్ట్స్, కరాటే రంగంలో విశిష్ట కృషి చేస్తూ ఎన్నో ఇంటర్నేషనల్ టోర్నమెంట్స్ నిర్వహించి మార్షల్ ఆర్ట్స్ లో ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఎందరినో కరాటే మాస్టర్లను తయారు చేసిన కీర్తిశేషులు గ్రాండ్ మాస్టర్ మల్లేష్ యాదవ్ కుమారుడు సాయినాథ్ వారి తండ్రి ఆశలను, ఆశయాలను నిలబెడుతూ ఎంతోమంది బాల బాలికలకు యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్, కరాటే క్రీడాకారులను తయారు చేస్తూ తనకంటూ ఒక ఉన్నత స్థాయిలో ఉంటూ ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్ యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ గ్రాండ్ మాస్టర్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాస్టర్ సాయినాథ్ కి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జన్మ ఎత్తినందుకు ఎంతో కొంత సార్ధకత ఉండాలి, ఏదో సాధించాలి తాను కొందరికైనా మార్గదర్శకంగా ఉండాలి అనే ఆ తపన అందరిలో రావాలని, అలాంటి వారే చరిత్రలో నిలిచి పోతారని అన్నారు. ఇటువంటి ఆణిముత్యం లాంటి అతిరథ మహారథులు హేమహేమీలు తమ ప్రతిభ పాటవాలను నలుగురికి పంచుతూ ఎన్నో అద్భుతాలు సృష్టించాలని ఆకాంక్షిస్తూ ఇలాంటి విజయాలను భవిష్యత్తులో మరెన్నో సాధించాలని పలువురు ఆకాంక్షించారు.

# చిల్లంచర్లలో నూతన కుమ్మర సంఘం కమిటీ ఎన్నిక

- ఏకగ్రీవమైన కుమ్మర సంఘ గ్రామ కమిటీ
- జిల్లా , మండల కమిటీ ఆధ్వర్యంలో



**తొలి అక్షరం/మరిపెడ, జనవరి 23:** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో కుమ్మర సంఘ మండల కమిటీ మరియు జిల్లా ఉపాధ్యక్షులు అలవాల వెంకన్న ఆధ్వర్యంలో చిల్లంచర్ల గ్రామ కుమ్మర సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది దీనిలో గ్రామ గౌరవ అధ్యక్షులుగా అల్వాల నరసయ్య సలహాదారులుగా అలువాల రమేష్ గ్రామ శాఖ అధ్యక్షుడు గా అలువాల మల్లయ్య ప్రధాన కార్యదర్శి గా కోలిషల్మ సతీష్ కోశాధికారిగాఆలువాల నరేష్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల కమిటీ గౌరవాధ్యక్షులు కొయ్యడ రామయ్య ముఖ్య సలహాదారు గణపారపు మల్లయ్య సలహాదారులు రాచకొండ రామచంద్రయ్య మండల అధ్యక్షులు అలవాల ఉపేందర్ ప్రజాపతి ప్రధాన కార్యదర్శి దూకుంట్ల వెంకన్న కోశాధికారి పాలబిందెల సోమయ్య మరియు చిల్లంచర్ల గ్రామ కుమ్మర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ఎదుట కార్మికుల ధర్నా

- కార్మికుల వాహనాలు దొంగతనం జరిగితే నిర్లక్ష్యం తగదు: కార్మిక సంఘాలు మద్దతు






**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి23:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని పట్టణంలోని చందన బ్రదర్స్ లో సుమారు 70 మంది కార్మికులు పనిచేస్తూ ఉన్నారు. షాపింగ్ మాల్ లో పనిచేసే కార్మికులు వివిధ గ్రామాల నుంచి తమ సొంత మోటార్ వాహనాలపై వస్తున్నారు, వారి వాహనాలకు షాపింగ్ మాల్ యాజమాన్యం బధ్రత కల్పించాలి . అవేమి పట్టించుకోకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుంది అందుకు నిరసనగా బ్రాంచి ఎదుట ఉద్యోగులు మెరుపు ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న కార్మిక సంఘం నేతలు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎన్ రాజు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. షాపులో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగుల బైకులు దొంగతనం జరిగితే యజమాన్యం దీనిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం సమాధానం చెబుతుండడంతో విసిగి వేసారిన సిబ్బంది మెరుపు ధర్నాకు దిగారు. గురువారం పరిగి రోడ్డులో గల చందనా బ్రదర్స్ షాపింగ్ మాల్ వద్ద సిబ్బంది ఎదురుగా కూర్చుని షాపింగ్ మాల్ లో పనిచేస్తున్న ఎక్లాస్ ఖాన్ పేట గ్రామానికి చెందిన శ్రీనివాస్, అదేవిధంగా మరో ఉద్యోగి గణేష్ ఇద్దరికీ సంబంధించిన రెండు బైకులు ఈ నెల 11న చోరీకి గురయ్యాయి. సిసి ఫుటేజీ తదితర వాటిని పరిశీలించి వాటిని పోలీసులకు అందజేసి తమకు న్యాయం చేయాలని ఇద్దరు బాధితులు యాజమాన్యాన్ని వేడుకుంటున్నారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా రేపు మాపు అని కాలం దాటవేస్తుండడంతో మీరు అసహనానికి గురయ్యారు. అదేవిధంగా పోయిన రెండు బైకులలో ఒక బైకు అన్నారం వద్ద లభించింది. ఆ బైకు కూడా తీవ్రంగా ధ్వంసం కాబడి ఉంది. మరో బైక్ లభించలేదు. షాపింగ్ మాల్ వాహనదారులు, సీసీ కెమెరాలు లేదా సెక్యూరిటీని ఏర్పాటు చేసి ఉంటే తమ బైకులు పోయేవి కావన్నారు అందుకు వెంటనే యాజమాన్యం సీసీ కెమెరాలు లేదా సెక్యూరిటీ ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఇలా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో పనిచేసే ఉద్యోగస్తులకు భద్రత ఎక్కడా అని యాజమాన్యాన్ని వారు ప్రశ్నించారు. వెంటనే హెచ్ఆర్ మేనేజరు షాపింగ్ మాల్ తో మాట్లాడి ఈనెల 28 వరకు సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు అదేవిధంగా పని గంటలు తగ్గించాలని తమకు ఇచ్చే జీతం సంవత్సరం సంవత్సరం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. దీంతో కార్మికులు తమ నిరసనను ముగిస్తున్నట్టు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించనిచో కార్మికులందరూ ఐక్యంగా తమ సమస్య పరిష్కారం కోసం అందరూ కలిసి ఐక్య పోరాటాలకు కలిసి రావాలని కార్మిక సంఘం నాయకులు వారికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు

- నివాళులర్పించిన పలువురు నేతలు



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి23:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన షాద్ నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ ఎంపీపీ ప్రకాష్ గౌడ్, అగ్గనూర్ బస్వం, కౌన్సిలర్ సర్వర్ పాషా, యువ నేతాజీ యూత్ గౌరవ అధ్యక్షుడు వన్నాడ వెంకటేష్ గౌడ్, శ్రీధర్ రాజు, కుమార్, అగ్గనూర్ నందు, అగ్గనూర్ రాజు, జగదీష్, శివ కుమార్ , గాజుల శేఖర్, రాజేష్, శంకరయ్య, శివ నారాయణ, రమేష్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మేరు కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

- వరంగల్ జిల్లా మేరు సంఘం - 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి




**తొలి అక్షరం/నెక్కొండ, జనవరి 23:** వరంగల్ జిల్లా నుండి నర్సంపేట మేరు సంఘం భవనంలో వరంగల్ జిల్లా మేరు సంఘం అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ మేరు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా హాజరైన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి , వరంగల్ జిల్లా మేరు సంఘం - 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ మేరు కులస్తులు పేదరికంలో ఉన్నారని, వారికి ప్రభుత్వ పథకాలలో సరైన అవకాశాలు కల్పిస్తామని, నర్సంపేటలో మేరు సంఘం భవనం పూర్తి చేయుటకు నిధులు మంజూరు చేస్తానని, అలాగే వారికి కుట్టు మిషన్లు ఇప్పించడంతోపాటు, ఇందిరమ్మ ఇండ్ల లో ప్రాధాన్యతను కల్పిస్తామని,స్కూల్ యూనిఫామ్ కుట్టుపని మేరు సంఘాలకు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా మేరు సంఘం నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట టి పి సి సి సభ్యులు పెండెం రామానంద్, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ,నర్సంపేట మండల కాంగ్రెస్ అద్యక్షుడు బానోత్ లక్ష్మణ్, మేరు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రాష్ట్ర నాయకులు తాళ్ల సంపత్ కుమార్, బోలకొండ రవితేజ, గూడూరు బాలాజీ, కర్నె రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోమకొండ శ్రీనివాస్, కోశాధికారి రామగిరి యాదగిరి స్వామి,జిల్లా ముఖ్య సలహాదారుడు గట్ల నాగేశ్వర్ రావు, నర్సంపేట పట్టణ, మండల మేరు సంఘం అధ్యక్షులు రామగిరి రవికుమార్, ఓడపల్లి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శు లు గట్ల రజనీకాంత్, మొలుగూరి వెంకటేశ్వర్లు, కోశాధి కారులు కర్నె రాజు,గంగాపురం ప్రకాష్,హన్మకొండ ప్రధాన కార్య దర్శి పొడిశెట్టి గణేష్, మేరు సంఘం నాయకులు ఓదెల సురేష్, నోముల భాస్కర్, గట్ల రఘుపతి, ఓదెల రవీందర్, పెండ్యాల శ్రీనివాస్, కొత్తకొండ గణేష్, పెండ్యాల శ్రీధర్,గట్ల శ్రీనివాస్, సోమ మధు, మునిగాల సత్యనారాయణ, రామగిరి యాదగిరి, సోమ శివకుమార్, అశోక్, గట్ల సుదర్శన్,నన్నే రవి,ఓడపెల్లి చందర్ రావు,ఓదెల రవి,సుధాకర్,గట్ల శ్రీనివాస్, గాయకులు ఓడపల్లి రమేష్ ,ఓడపల్లి మాధవి, మహిళా నాయకులు గట్ల రజిత, గట్ల రేణుక, వోడపల్లి స్రవంతి, గంగాపురం వనజ,రామగిరి మంజుల,ధనలక్ష్మి,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కమీషనర్‌ను కలిసిన నెక్కొండ నూతన సర్కిల్ ఇన్స్ స్పెక్టర్

**తొలి అక్షరం/నెక్కొండ, జనవరి 23:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని పోలీస్ కమీషనరేట్ పరిధిలోని నెక్కొండ లో నూతన సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్. శ్రీనివాస్ వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూను కమిషనర్ కార్యాలయములో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. ప్రజలు పోలీసులపై ఉన్న నమ్మకానికి తగ్గట్టుగానే నీతి నిజాయితీతో ప్రజలకు సేవలంది ంచాలని, పోలీస్ కమిషనర్ నూతన సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ సూచించారు.



# ప్రతిష్ఠాత్మక తెలుగుకీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం గ్రహీత డా.కావూరి శ్రీనివాస్ శర్మ



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి23:** సాహిత్య, పరిశోధన,సినీ,లఘు చిత్ర రంగాల్లో విశేష కృషిని సల్పి ఇప్పటి వరకు 30 గ్రంథాలను రచించి, తెలుగు సాహిత్యానికి అంతగా(అసలే)తెలియని ప్రాచీన తాళపత్ర గ్రంథాలను సేకరించి పరిష్కరిస్తున్న డా.కావూరి శ్రీనివాస్ శర్మ కి విజయవాడలో శ్రీ కౌత పూర్ణానంద కళా వేదికలో అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక తెలుగుకీర్తి జాతీయ ప్రతిభా పురస్కారంన్ని డా.కావూరి శ్రీనివాస్ శర్మ అందుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారం రావడం వల్ల మరింత భాధ్యత పెరిగిందని శర్మ తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో బోయి భీమన్న సాహిత్య నిది చైర్ పర్సన్ బోయి హైమవతి అమ్మ,జాతీయ అధ్యక్షురాలు కొల్లి రమావతి,ఈశ్వరి భూషణం, గరిమెళ్ళ రాజేంద్ర,కార్యక్రమ నిర్వాహకులు సిబ్బంది పాల్గొని హర్షనాదాలు తెలియజేశారు.

# గ్రామ సభలలో ప్రజలు గరం గరం

- ప్రభుత్వ పథకాలకు అర్హులు అయినా కూడా పేర్లు గల్లంతు
- ప్రభుత్వ అధికారులపై తిరగబడ్డ జనం





**తొలి అక్షరం/పెద్ద వంగర జనవరి 23:** మండల కేంద్రంలో పెద్ద వంగర బావోజీ తండా టిక్యా తండా మొత్యా తండా పోచారం రెడ్డీకుంత తండా గ్రామ పంచాయతీలలో జరిగిన గ్రామసభ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని గతంలో జరిగిన ప్రజా పాలన దరఖాస్తు చేసుకోనగ అర్హులైన కూడా అభ్యర్థుల పేర్లు గల్లంత కావడంతో అధికారుల పైన ప్రజలు తిరగబడ్డారు ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పథకాలను పేద ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారంగా ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందజేయాలని అధికారులను కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ మహేందర్. ఎంపీడీవో వేణుమాధవ్. అగ్రికల్చర్ ఎ ఓ స్వామినాథ్. ఇరిగేషన్ ఏఈ కవిత. వివిధ గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులు రమేష్.గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ




**తొలిఅక్షరం/నెక్కొండ, జనవరి 23:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్లో 6 నుండి 10వ తరగతిలో ప్రవేశాలకు జనవరి 6 తేదీ నుండి ఫిబ్రవరి 28 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం,ప్రణయ్ కుమార్ తెలిపారు.అదేవిధంగా ఏప్రిల్ 13న, ప్రవేశ పరీక్షలు ఉంటాయనీ ఆరో తరగతిలో 100 % సీట్లకు ప్రవేశాలు ఉంటాయని,7 నుంచి 10 తరగతిలో ఖాళీలుగా ఉన్న సీట్లను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఎస్సీ,ఎస్టీ, బీసీ దివ్యాంగులు మరియు ఈ, బీ,సీల కు రూపాయలు 125 /- ఓ, సి లకు రూపాయలు 200/- చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది.

# చెగూరులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఘన స్వాగతం

**- భారీ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన మాజీ ఎంపీపీ ఎమ్ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు**

**తొలి అక్షరం/నందిగామ, జనవరి23:** రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్ నియోజకవర్గం లోని నందిగామ మండలం చేగూరు గ్రామంలో ప్రత్యేకాధికారి రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు విచ్చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్ భారీ పుష్పగుచ్ఛం తో స్వాగతం పలికారు. తమ అభిమాన నేత చేగూరు కు చేరుకోగానే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పసుల బుచ్చ య్య, మంకాల శ్రీశైలం, బుయ్యని వీరేందర్ గౌడ్, ఆవుల శివ, వెంకట చారి,గుండాల వేణుగోపాల్, సాములయ్య నరేందర్, ఎం రాజు గౌడ్,ఎం శ్రీనివాస్ గౌడ్,ధరూర్ సతీష్ గౌడ్, సాలయ్య, పసుల పాండు, సాములయ్య, మంగల్ యాదగిరి తదితరులున్నారు.



# ఈ నాలుగు పథకాలు నిరంతరం ప్రక్రియ కాబట్టి ప్రజలు ఎవరు అదేరపడొద్దు గ్రామ శాఖ అధ్యక్షులు భూక్యా సతీష్

- సంతులాల్ పోడ్ గ్రామ సభలో పాల్గొన్న గ్రామ శాఖ కాంగ్రెస్ నాయకులు





**తొలి అక్షరం/బయ్యారం, జనవరి 23:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో ఈరోజు జరిగిన సంతులాల్ పోడ్ గ్రామపంచాయతీ గ్రామ సభలో స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది . సంతులాల్ పోడ్ గ్రామ శాఖ అధ్యక్షులు భూక్యా,సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తరగతిగ చేయలేకపోయినా లేట్ అయినప్పటికీ కాంగ్రెస్ రాష్ట్రప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నప్పటికీ కొత్త రేషన్ కార్డులు, ఇంద్రమ్మ ఇల్లు , రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,విలాంటి పథకాలను కార్యక్రమాన్ని తీసుకొచ్చి అర్హులైన వారందరికీ ఈ పథకాలు అందుతాయి. ఎవరు కూడా అదేర పడవలసిన అవసరం లేదు.ఇది నిరంతర ప్రక్రియ ఏ రాజకీయంతో గాని ఈ జెండాలతో కాని పనిలేదు అర్హులైన ప్రజలందరికీ నిరంతర ప్రక్రియ కాబట్టి ఎప్పుడైనా అప్లై చేసుకోవడానికి దానికి సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ, స్పెషల్ ఆఫీసర్, ఏవో, ఏపీఎం, ఫీల్డ్ అసిస్టెంట్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బోడ, గణేష్ గుగులోత్, లచ్చిరాం, మట్ల, కిషోర్ గుగులోత్, రాజారాం నిమ్మగడ్డ, శివ, పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# కేంద్రీయ విద్యాలయములో ఘనముగా నేతాజీ జయంతి

- గౌరవ అతిథిగా హాజరైన ఏ.ఎమ్.ఓ చంద్రశేఖర్ ఆజాద్
- విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇంచార్జీ ప్రిన్సిపాల్ ముఖేష్ కుమార్




**తొలి అక్షరం/మహబుబాబాద్ జనవరి 24:** మహబుబాబాద్ జిల్లా కేంద్రంలోని గురువారం కేంద్రీయ విద్యాలయం లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పరిక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ముఖేష్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర సమరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆజాద్ హిందూ ఫౌజ్ ను స్థాపించి, చూపిన పోరాట పటిమ ఉన్నతమైనదని అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపల్ అధ్యక్షతన నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని పురస్కరించుకొని పాఠశాల యందు నేతాజీ చిత్రపటానికి పూలమాలను సమర్పించి, జ్యోతి ప్రజ్వలనతో పరాక్రమ్ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల పోరాటపటిమను విద్యార్థులకు పరిచయము చేయుటకై లఘు చిత్రాన్ని ఎల్ఈడి స్క్రీన్ పై ప్రదర్శించినారు. అనంతరము పరీక్ష పై చర్చ లో భాగముగా విద్యార్థులు నిరంతరము పాఠ్యపుస్తకాలను చదవడం, పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం ద్వారా, గతంలోని పరీక్షా పత్రాలను సాధన చేయడం ద్వారా, పరీక్షా ఒత్తిడిని విద్యార్థులు సులభంగా అధిగమించవచ్చునని గౌరవ అతిథి చంద్రశేఖర్ ఆజాద్ ఏ. ఎం. ఓ. మహబూబాబాద్ జిల్లా గారు విద్యార్థులను ఉద్దేశించి తన ప్రసంగంలో తెలిపినారు. వివిధ పాఠశాలలు మరియు కళాశాల నుండి వచ్చిన విద్యార్థినీ, విద్యార్థుల కు క్విజ్ పోటీని నిర్వహించినారు.పోటీలో ప్రథమ స్థానంలో మహమ్మద్ తౌసిఫ్, కేంద్రీయ విద్యాలయము, మహబూబాబాద్., ద్వితీయ మరియు తృతీయ స్థానంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్,గూడూరు విద్యార్థులు భారత్ సింహ మరియు సుభాష్ ద్వితీయ మరియు తృతీయ స్థానం సాధించిగా విద్యార్థులకు షీల్డ్, సర్టిఫికెట్ ను కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ , బహుకరించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంస పత్రముతో పాటు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి ద్వారా రచింపబడిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని అందించినారు. విద్యార్థులందరికీ స్వీట్లు, స్నాక్స్ అందించారు. టెన్సిన్ డోల్మా, రితేష్ మౌర్య ,సతీష్ చౌదరి ,దుర్గాప్రసాద్, క్రాంతి, శ్రీలత ,ఆఫ్రిన్, శుక్ల ,సుమిత్, భాస్కర్ ,బాబా ఫిరోజ్, అమన్ పాషా ,సౌజన్య ,శృతి ,తపస్వి, యాస్మిన్, మోసిన్ బేగ్, జితేందర్, వర్మ, ఇమాముద్దీన్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేవని అధికారులకు, ప్రజల మధ్య వాగ్వాదం

- పథకాల ఎంపికకు మూడో రోజు గ్రామసభలు





**తొలి అక్షరం/నర్సింహులపేట జనవరి 23:** అధికారులకు, ప్రజల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నాయి. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు గ్రామసభలో లబ్ధిదారుల ఎంపికకు అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గురువారం మండలంలోని అజ్మీర తండా, ముంగిమడుగు, దాస్ తండా, వంతడుపల, బాస్ తండా, గోపతండ గ్రామాల్లో గ్రామ సభలను ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శుల అధ్యక్షతన నిర్వహించారు. గ్రామసభలో రేషన్ కార్డుల కోసం, రైతు భరోసా కోసం అధికారులను ఆయా గ్రామస్తులు ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు అనర్హులకే ఇచ్చారని వార్డు ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన వారి లిస్టును రద్దు చేసే వరకు కొత్త అప్లికేషన్లు పెట్టుకోబోమని తేల్చిచెప్పడంతో అధికారులు చేసేదేంలేక అక్కడినుంచి వెళ్లిపోయారు. గ్రామసభలో ఆరు గ్యారెంటీలపై అధికారులను నిలదీశారు. రైతు భరోసా, రెండు లక్షల రుణమాఫీ కాలేదని, తులం బంగారం ఇవ్వలేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేవని మండల స్పెషల్ ఆఫీసర్లను, అధికారులను, పంచాయతీ కార్యదర్శులను గ్రామస్తులు నిలదీశారు. కార్యక్రమంలో తాహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో మాధవి, ఏవో వినయ్ కుమార్, ఎంపీఓ యాకయ్య, స్పెషల్ ఆఫీసర్లు డాక్టర్ సౌమ్య, ఎంఈఓ రామ్మోహన్ రావు, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కోటగడ్డ గ్రామపంచాయతీ గ్రామసభకు హాజరైన గ్రామ శాఖ కాంగ్రెస్ నాయకులు




**తొలి అక్షరం/బయ్యారం, జనవరి 23:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోడగడ్డ గ్రామం.లో ఈరోజు జరిగినటువంటి గ్రామసభలో నూతంకి మధుసూదరావు .మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు పథకాలను , నాలుగు గ్యారంటీ పథకాలకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న గ్రామ సభలలో అధికారుల సమక్షంలో తెల్ల రేషన్ కార్డులు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని మరియు ఇల్లు లేని వారు ఇందిరమ్మ ఇండ్లు పథకంకు,ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు చేసుకోవాలని అదే విధంగా నాలుగు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రజలు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కూడా కొంతమంది కుటుంబ సభ్యుల పేర్లు నమోదు కాలేదనీ మరియు వారి యొక్క దరఖాస్తు రాలేదని విన్నాము. వారు కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఈ యొక్క గ్రామ సభలలో వారి యొక్క దరఖాస్తులను అధికారుల సమక్షంలో ఇచ్చి ఈ యొక్క అవకాశాన్ని. వినియోగించుకోవాలని తెలిపారు.అదేవిధంగా కోట గడ్డ గ్రామపంచాయతీ ప్రజలు ప్రతి ఒకరు గ్రామపంచాయతీ గ్రామసభలో మండల అధికారుల సమక్షంలో తెల్ల రేషన్ కార్డులు లేని వారు మరియు ఇల్లు లేని వారు ఇందిరమ్మ ఇల్లులకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదర్శకాలకు దరఖాస్తు చేసుకోవాలి నూతంకి మసూదన్ రావు అన్నారు.ఈ యొక్క కార్యక్రమము లో. కాంగ్రెస్ పార్టీ నాయకులు. నూతంకి మసూదన్ రావు భూతం వెంకన్న దొంతు నరసయ్య నరసింహారావు మేడ శ్రీనివాస్ కాయం వెంకన్న కాయ%శీ%సత్యం.పాయం కృష్ణ నల్లబెల్లి వెంకటేశ్వర్లు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సంవత్సరాలు అయినా కూడా బిఆర్ఎస్ ఏమి అభివృద్ధి పనులు చేయలేదు

- గ్రామసభలో ప్రతిపక్ష నాయకులు ప్రజలను రెచ్చగొట్టడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు: కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమేష్



**తొలి అక్షరం/నరసింహుల పేట జనవరి 24:** దశాబ్ద కాలం అధికారంలో ఉండి ఏ ఒక్కరికి ఒక్క ఇల్లు కూడా ఇవ్వని గత ప్రభుత్వం, ప్రతిపక్ష నాయకులు ఇవాళ గ్రామ సభలలో ప్రజలను రెచ్చగొడుతున్నారు అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జినుకల రమేష్. మాజీ ఎంపీటీసీ అనురాధ అన్నారు గురువారం తొలి అక్షరంతో వారు మాట్లాడుతూప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే విధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందిదయచేసి అన్ని గ్రామాల ప్రజలు గ్రామ సభలలో అధికారులు చెప్పే విషయాలను పాటిస్తూ అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలిఆరు గ్యారెంటీలతో ప్రజల కలను నెరవేర్చనున్న ప్రజా ప్రభుత్వంకొంత మంది టిఆర్ఎస్ నాయకులు గ్రామసభలలో ప్రజలను రెచ్చగొట్టి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారుగ్రామ సభలో లేని ఎజెండాలను లేవనెత్తి ప్రజలని అయోమయానికి గురి చేసి గొడవలకు దారి తీస్తున్నారు. అటువంటి వారికి ఖబర్దార్. ప్రజలు అన్ని గమనిస్తున్నారుపది సంవత్సరాలు అధికారంలో ఉండి నియోజకవర్గ మొత్తంలో ఏ ఒక్కరికి ఒక్క ఇల్లు ఇవ్వలేదు కనీసం రేషన్ కార్డు ఇవ్వలేదు అలాంటి మీరు అధికారం కోల్పోయాక ప్రజల కష్టాల గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసము అనేది ప్రజలు గుర్తుచేసుకోవాలి. అమాయక ప్రజలను రెచ్చగొట్టి గ్రామ సభలలో వచ్చే అధికారులను ఇబ్బంది పెట్టి పేద కుటుంబాలకు అన్యాయం చేసే దిశగా ఈ రోజు టిఆర్ఎస్ చేస్తుంది. దయచేసి అన్ని గ్రామాల ప్రజలు గమనించి మీరు ఏ ఏ పథకాలకు అర్హులైనవారో ఆ పథకాలు పొందగలరు. గ్రామ సభలో ఎన్ని ఎజెండాలు ఉన్నాయో అధికారులు క్లుప్తంగా మీకు వివరిస్తారు. మీకున్న సందేహాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోగలరు ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మకూడదు మండల ప్రజలు ఆలోచించగలరు

# నేరెళ్ల చెరువు దర్గాలో ఉర్సు కార్యక్రమాలు

- దర్గా ఉర్సు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**తొలి అక్షరం/ఫరూక్ నగర్, జనవరి23:** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల బూర్గుల పరిధిలోని నేరెళ్ల చెరువు గ్రామంలోని దర్గా హజ్రత్ షా మూసా ఖాద్రీ దర్గాలో ఉర్సు కార్యక్రమాలు జరిగాయి. దర్గా ఉర్సు కార్యక్రమాలకు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రత్యేక హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ముస్లిం మత పెద్దలు సాదరంగా ఆహ్వానం పలికారు. ఉర్సు సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండి అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ప్రత్యేక ప్రార్థన ద్వారా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ఫరుక్ నగర్ మాజీ వైస్ ఎంపిపి మౌనిక హరిక్రిష్ణ గౌడ్, బిఆర్ఎస్ మైనారిటీ నాయకులు పర్వేస్ హుస్సేన్, అడ్డు ఎజాజ్, సయ్యద్ అద్నాన్, బూర్గుల కోఫ్షన్ మెంబెర్స్ సి ఎల్లయ్య, బూర్గుల బిఆర్ఎస్ నాయకులు పి.నర్సిములు, సి. నర్సిములు, ముస్లీమ్ పెద్దలు సయ్యద్ సాబీర్ సహాబ్, సయ్యద్ సాజిద్, సయ్యద్ నజీర్ హుస్సేన్, సయ్యద్ ఉమర్ సయ్యద్ మన్సూర్, సయ్యద్ జావిద్ సయ్యద్ జిలాని సయ్యద్ ఉస్మాన్, యువ నాయకులు శివా చారి, పవన్ ఠాకూర్, సుధీర్, మధు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏంటి బెదిరిస్తున్నారా..?




## • అభిమానులపై అనుపమ అసహనం

సోషల్ మీడియాలో సెలబ్రిటీల మీద నెటిజన్లు చేసే కామెంట్లు ఎలా ఉంటాయో అందరికీ తెలిసిందే. ఇక బయట హీరోయిన్లు కనిపిస్తే కొంత మంది ఆకతాయిలు హద్దులు దాటుతుంటారు. ఇక హీరో హీరోయిన్లు బయటకు వచ్చే ముందే టైట్ సెక్యూరిటీతో వస్తుంటారు. అందుకే ఈ బౌన్సర్ల కల్చర్ కూడా ఎక్కువగా పెరిగింది. అభిమానం పేరుతో కొంత మంది ఆకతాయిలు చేసే చేష్టలు హద్దులు దాటుతుంటాయి. తాజాగా అనుపమ సింపుల్‌గా ఎంట్రీ ఇచ్చే ప్రయత్నం చేసింది. ఇక అనుపమ పరదా మూవీతో త్వరలోనే ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనుపమ సింపుల్‌గా ఎలాంటి బంధోబస్తు లేకుండా వచ్చేసింది. ఇలా సినిమాలో వాడిన వాహనంతో అనుపమ సినిమాలోని గెటప్‌తోనే ఎంట్రీ ఇచ్చింది. దీంతో అనుపమని అభిమానులు చుట్టు ముట్టేశారు. దీంతో వాహనం ఎక్కువ వేగంగా ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో అనుపమను ఫోటోలు తీసుకోవడం, సెల్ఫీలు తీసుకోవడం, హాయ్ చెప్పండి.. బాయ్ చెప్పండి అంటూ ఇలా అభిమానులు ఇష్టమొచ్చినట్టుగా ప్రవర్తిస్తూ వచ్చారు. దీంతో అనుపమ నవ్వుతూనే వారి మీద అసహనం వ్యక్తం చేసింది. ఏంటి? బెదిరిస్తున్నారా? హాయ్ చెప్పు.. బాయ్ చెప్పు.. అని బెదిరిస్తున్నారా? అంటూ అనుపమ తన కోపాన్ని ఆపుకుంటూనే నవ్వుతూ కౌంటర్లు వేసింది. ప్రస్తుతం అనుపమ వీడియో అయితే నెట్టింట్లో బాగానే ట్రెండ్ అవుతోంది. అనుపమకు హిట్లు వచ్చినా, ఫ్లాపు వచ్చినా కూడా గ్రాఫ్ పెరగడం లేదు.. తగ్గడం లేదు. ఎప్పుడూ అదే గ్రాఫ్‌ను మెయింటైన్ చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. కార్తికేయ 2, 18 పేజీస్ అంటూ మంచి హిట్లు వచ్చాయి. అయినా కూడా అనుపమకు అనుకున్న రేంజ్‌లో మళ్లీ సినిమాలు పడలేదు. ఆమె కూడా చాలా సెలెక్టివ్‌గా స్క్రిప్ట్‌లను ఎంచుకుంటున్నట్టుగా కనిపిస్తోంది. అందుకే ఈ పరదా మూవీని ఏరికోరి మరీ చేసింది. సుబ్బు పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందని అనుపమ పరదా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో చెప్పిన మాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# డైరెక్టర్ ఓం రమేశ్ కృష్ణ మిస్సింగ్

హైదరాబాద్‌లో మూవీ డైరెక్టర్ ఓం రమేశ్ కృష్ణ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మియాపూర్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో నివాసముంటున్న రమేశ్ కృష్ణ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు రమేశ్ కృష్ణ కోసం వెతికారు. ఎక్కడా కూడా ఆచూకీ లభించకపోవడంతో తన భర్త కనిపించడం లేదంటూ రమేశ్ కృష్ణ భార్య శ్రీదేవి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసింది. తన భర్త ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా ఇండస్ట్రీలో రమేశ్ కృష్ణతో పని చేసిన వారిని, స్నేహితులను విచారిస్తున్నారు.




# నేను మనీని బ్లాక్‌లో తీసుకోను : వెంకటేష్

2025 సంక్రాంతి కానుకగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా మొదటి వారం రోజుల్లో రూ.230 కోట్ల వసూళ్లు రాబట్టింది. కేవలం తెలుగులో విడుదల అయ్యి ఈ స్థాయి వసూళ్లు సాధించడం రికార్డ్‌గా చెప్పుకోవచ్చు. తెలుగులో మాత్రమే విడుదల అయ్యి పాన్ ఇండియా సినిమాల రేంజ్‌లో వసూళ్లు సాధిస్తున్న ఈ సినిమాకి సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. దిల్ రాజు ఐటీ రైట్స్ జరుగుతున్న కారణంగా ఈ మీడియా సమావేశంకు హాజరు కాలేదు. హీరోయిన్స్ ఇద్దరూ మొన్నటి వరకు హైదరాబాద్‌లో ఉండి వెళ్లి పోయారు. దాంతో ఈ సక్సెస్ మీట్‌లో హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు భీమ్స్ పాలు పాల్గొన్నారు. సినిమా సక్సెస్ నేపథ్యంలో మీడియాతో తమ అనుభవాలను, సంతోషాన్ని పంచుకున్నారు. ఆ సమయంలో రిపోర్టర్స్ పలు ప్రశ్నలను వీరిని అడిగారు. వెంకటేష్ గారితో ఒక రిపోర్టర్... ఐటీ రైడ్స్ గురించి నిర్మాతలతో మాట్లాడిన సమయంలో హీరోలు కనుక తమ పారితోషికంను మొత్తం వైట్ తీసుకుంటే ఏ నిర్మాత బ్లాక్ మనీ ఇవ్వాల్సిన అవసరం లేదు అంటున్నారు.. దీనిపై మీ అభిప్రాయం ఏంటని ప్రశ్నించారు. అందుకు వెంకటేష్ స్పందిస్తూ.. ఇతర హీరోల విషయం తనకు తెలియదు కానీ, తాను మాత్రం ఫుల్ వైట్. తీసుకునేది కొంచమే, ఎక్కువ తీసుకోను.. అదీ ఆఫీస్ వాళ్లు తీసుకుంటారు అన్నారు. తాను పారితోషికం ఎక్కువ తీసుకోనని, తీసుకునే కొంత మొత్తాన్ని పూర్తిగా వైట్ మనీగా తీసుకుంటానని వెంకటేష్ క్లీయర్‌గా చెప్పుకొచ్చారు. ఈమధ్య కాలంలో యంగ్ స్టార్ హీరోలు వందల కోట్ల పారితోషికాలు అందుకుంటున్న కారణంగా వారు కొంత మొత్తాన్ని బ్లాక్ మనీగా తీసుకుంటారనే టాక్ ఉంది.



# దిల్‌రాజ్ తల్లికి అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

గత మూడు రోజులుగా టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఇంట్లో ఐటీ సోదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. సోదాల్లో భాగంగా ఇప్పటికే ఐటీ అధికారులు దిల్ రాజుతో పాటు అతడి భార్యను విచారించడంతో పాటు వారి బ్యాంక్ వివరాలను అడిగినట్లు సమాచారం. అయితే గత మూడు రోజులుగా జరుగుతున్న దాడి నేపథ్యంలో దిల్ రాజు తల్లి అస్వస్థతకు గురయ్యింది. దీంతో వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఐటీ శాఖకు సంబంధించిన వెహికిల్‌లోనే ఆమెని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు కుటుంబ సభ్యులు. వీరితో పాటు ఐటీ శాఖకు సంబంధించిన మహిళా అధికారి వెళ్లారు. మరోవైపు ఐటీ అధికారులు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ , మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థలు ఆయా సినిమాలకు పెట్టిన పెట్టుబడులు, ఆదాయాలపై ఆరాతీస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్.

# ఇంకా హార్డ్‌వర్క్ చేయి డైరెక్టర్ రవిపూడికి చిరంజీవి సలహా



సినిమాకు బ్లాక్ బస్టర్ సక్సెస్ దక్కడంతో దర్శకుడు అనిల్ రావిపూడి పోస్ట్ రిలీజ్ ప్రమోషన్స్‌తోనూ దూసుకు పోతున్నారు. సినిమా విడుదల తర్వాత వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ సినిమా కోసం తాను అనుకున్న నటీనటులను, సాంకేతిక నిపుణులను తీసుకున్నాను. ఎక్కడా రాజీ పడాల్సిన అవసరం రాలేదని అన్నారు. నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ గారు తనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని, బడ్జెట్ విషయంలో తాను అనుకున్న దానికి వారు ఓకే చెప్పారని అన్నారు. నిర్మాతలు తనపై చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ వారు ఎన్నో గొప్ప విజయాలను అందుకున్నారు, నాపై వారు చూపించే అభిమానంతో అలా మాట్లాడారని చెప్పుకొచ్చారు. అనిల్ రావిపూడి తదుపరి సినిమాను మెగాస్టార్ చిరంజీవితో చేయబోతున్న విషయం తెల్సిందే. కనుక సంక్రాంతికి వస్తున్నాం సినిమాపై మెగాస్టార్ రియాక్షన్ ఏమై ఉంటుంది అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా దర్శకుడు అనిల్ రావిపూడి ఆ విషయమై స్పందిస్తూ... చిరంజీవి గారు ఊర్లో లేరు. ఆయన సినిమా రిజల్ట్ గురించి తెలిసి నాకు మెసేజ్ చేశారు. చాలా సంతోషంగా ఉంది, మన సినిమాకు ఇంకా ఎక్కువ హార్డ్ వర్క్ చేయి అని చెప్పారు. సినిమా చూసి ఉంటే తప్పకుండా ఫోన్ చేసి మరిన్ని విషయాలను ఆయన చెప్పేవారు. ఈ సినిమా ఫలితంతో ఆయన చాలా సంతోషంగా ఉన్నారని అనిల్ రావిపూడి పేర్కొన్నారు.

# వర్మకు అంథేరీ కోర్టు షాక్

### మూడు నెలల జైలుశిక్షతోపాటు రూ.3.72 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు అంథేరీ కోర్టు షాక్ ఇచ్చింది. చెక్ బౌన్స్ కేసులో ఆర్జీవీ మూడు నెలల జైలు శిక్షను విధించింది. అంతే కాకుండా 3.72 లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సిందేనని కోర్టు స్పష్టం చేసినట్టుగా తెలుస్తోంది. 2018లో మహేష్ చంద్ర మిశ్రా వేసిన ఈ కేసులో భాగంగా కోర్టు నేడు ఈ విధంగా తీర్పునిచ్చింది. మరి వర్మ దీనిపై ఎలా రియాక్ట్ అవుతాడో చూడాలి. గత ఏడేళ్లు కోర్టులో వాదనలు జరుగతూనే ఉన్నాయట. కానీ వర్మ మాత్రం ఏనాడూ కోర్టులో హాజరు కాలేదని సమాచారం. దీంతో ఆగ్రహించిన కోర్టు వర్మకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసి ఇలా తీర్పుని ఇచ్చింది. వర్మ ప్రస్తుతం కమ్ బ్యాక్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గానే సత్య రీ రిలీజ్ సందర్భంగా వర్మ రియలైజ్ అయ్యాడు. తాను ఇంత గొప్ప సినిమాల్ని తీశానంటే నమ్మబుద్ధి కావడం లేదని, తనకు పరిశ్రమ ఇచ్చిన అవకాశాల్ని ఉపయోగించుకోలేదని, మధ్యలో పిచ్చి పిచ్చి చిత్రాలన్నీ చేశానని వర్మ పశ్చాతాప్పడ్డాడు. ఇక తాను మంచి చిత్రాలే తీస్తానని చెప్పుకొచ్చాడు. ఈ క్రమంలోనే సిండికేట్ అనే ఓ కొత్త మూవీ గురించి ప్రకటించాడు. టైటిల్‌తో పాటుగా సినిమా కాన్సెప్ట్‌ను కూడా పంచుకున్నాడు. క్రైమ్ ఎప్పుడూ అంత కాదని, రూపం మార్చుకుంటుందని, మనుషులే జంతువుల కంటే క్రూరమైన వాళ్లు అనే కాన్సెప్టులతో సిండికేట్ సినిమా ఉంటుందని వర్మ చెప్పుకొచ్చాడు. చూస్తుంటే మళ్లీ సర్కార్, సత్య రేంజ్‌లో మూవీని వర్మ ప్లాన్ చేసినట్టుగా కనిపిస్తోంది. త్వరలోనే సిండికేట్ కాస్ట్ అండ్ క్రూ గురించి ప్రకటిస్తానని వర్మ తెలిపాడు. మరి వర్మ మాటలు ఇప్పుడు నిర్మాతలు నమ్మే స్థితిలో ఉన్నారా? అసలు వర్మ చిత్రాలు అంటే ఆడియెన్స్ చూస్తారా? అన్నది అనుమానమే. గత కొన్నేళ్లుగా పిచ్చి, అడల్ట్, పనికి రాని చిత్రాలు తీస్తూ వర్మ తన ఇమేజ్‌ను తానే సర్వ నాశనం చేసుకున్న సంగతి తెలిసిందే.అయితే ఈ కేసుకు సంబంధించి ట్విట్టర్ వేదికగా స్పందించారు వర్మ. నా మీద అంధేరి కోర్టు విధించిన శిక్షకు సంబంధించి నేను క్లారిటీ ఇవ్వాలి అనుకుంటున్నాను.. ఇది 7 ఏండ్ల క్రితం నాటి విషయం. నా మాజీ ఉద్యోగితో ? 2.38 లక్షల వివాదానికి సంబంధించినది. నా న్యాయవాదులు ఈ ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నారు. కేసు ప్రస్తుతం కోర్టులో ఉన్నందున దీని గురించి ఇంతకంటే ఏం చెప్పలేను అంటూ ఆర్జీవీ రాసుకోచ్చాడు.

